www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 12 జులై 2025 5 కాకినాడ



లెక్చరర్ పోస్టుల పరీక్షలకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-కాకినాడ

ఈ నెల 15 నుంచి 23 వరకు ఏపిపిఎస్‌సి ఆధ్వర్యాన లెక్చరర్ పోస్టులకు నిర్వహించనున్న పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని డిఆర్ఒ జె. వెంకటరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. కాకినాడ ఎస్.అచ్యుతాపురం అయాన్ డిజిటల్ జోన్, రాయుడుపాలెంలోని సాఫ్ట్ టెక్నాలజీస్ పరీక్షా కేంద్రాల్లో లెక్చరర్ పోస్టులకు కంప్యూటర్ బేస్డ్ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ పరీక్షలు ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ పరీక్షలను పరిశీలించేందుకు టాస్క్ ఫోర్స్ టీమ్స్ ఏర్పాటు చేశామని, పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించాలని, పరీక్షలకు అంతరాయం లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు చేపట్టాలని ఆయా అధికారులను ఆదేశించారు.

నత్తనడకన ఖరీఫ్ సాగు

- 40 శాతం దాటని నాట్లు
- అరకొరగానే సాగునీటి సరఫరా
- ప్రకృతి వైపరీత్యాలపై రైతుల ఆందోళన

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

సాగునీటి లభ్యత సకాలంలో ఉంటే జూన్ 1 నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతుంది. నెలాఖరుకు నారు మడులు పూర్తయ్యి జులై మొదటి వారానికల్లా నాట్లు వేసే పనులు పూర్తి కావాల్సి ఉంది. కానీ ప్రస్తుతం ఖరీఫ్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ ఏడాది కూడా ఖరీఫ్ ఆలస్యంగా ప్రారంభమైంది. సాగునీరు సక్రమంగా అందకపోవడంతో బాటు సకాలంలో పూర్తిస్థాయిలో వర్షాలు లేకపోవడంతో సాగు కష్టాలు వెంటాడుతున్నాయి. దీంతో రాబోయే ప్రకృతి వైపరీత్యాలను తలచుకుంటూ అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం కాలువల ఆధునికీకరణ పనులను సక్రమంగా నిర్వహించకపోవడంతో రైతులు నష్టపోయే పరిస్థితి నెలకొంది.

జిల్లాలో సుమారు 3 లక్షల ఎకరాల్లో ఈ ఏడాది కూడా రైతులు ఖరీఫ్ పంటలను సాగు చేయనున్నారు. ఇందులో దాదాపు 2,25,750 ఎకరాల్లో వరిని సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అంచనా. వెదజల్లు సాగు ద్వారా 90,300 ఎకరాలు (40 శాతం), బెంగాల్ కూలీల ద్వారా 67,700 ఎకరాలు (30 శాతం), నాట్లు ద్వారా 67,750 (30 శాతం) సాగు జరగనుంది. గోదావరి కాలువ ద్వారా సుమారు 1.20 లక్షల ఎకరాలు, ఏలేరు ద్వారా సుమారు 50 వేల ఎకరాలు, పంపా ద్వారా 7,800 ఎకరాలు, తాండవ ద్వారా 10 వేల ఎకరాలు, పుష్కర కాలువ ద్వారా 5,400 ఎకరాలు, సుబ్బారెడ్డి సాగర్ ద్వారా 4,900 ఎకరాలు, బోర్లు, ట్యాంకుల ద్వారా 30 వేల ఎకరాల్లో సాగు జరగనుందని అధికారులు చెబుతున్నారు.



పిఠాపురం-సామర్లకోటలో నేటికీ నాట్లు పడని పంట పొలాలు

ప్రణాళికలకు భిన్నంగా పనులు

సాగునీరు సక్రమంగా అందినట్లయితే ఇప్పటికే నాట్లు వేసే పనులు పూర్తి కావాల్సి ఉంది. జిల్లాలో ఇప్పటికే 2.25 లక్షల ఎకరాల్లో వరి పండాల్సి ఉంది. ఇప్పటికే 60 శాతం పైనే సాగు పనులు పూర్తి కావాల్సి ఉంది. కానీ ఇప్పటి వరకు సుమారు 11 వేల ఎకరాల్లో మాత్రమే సాగు పనులు పూర్తి అయ్యాయి. 5 శాతం పనులు కూడా పూర్తి కాని పరిస్థితి నెలకొంది. సాగునీటి సరఫరాలో పర్యవేక్షణ లోపాలు, కాలువల్లో పేరుకుపోయిన పూడిక, ఆధునీకరణ పనులు చేపట్టకపోవడం వంటి పలు కారణాల నేపథ్యంలో ఎక్కువ ప్రాంతాలకు సాగు నీరందని పరిస్థితి ఏర్పడింది. దీంతో ఖరీఫ్ ఊపందుకోలేదు.

వరదలు, భారీ వర్షాల భయం

జూన్ 1 నుంచి జూన్ నెలాఖరు వరకు ఖరీఫ్ పనులు పూర్తి కావాల్సి ఉన్నా వాతావరణ పరిస్థితులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా జులై రెండో వారం వచ్చినా పనులు ఇంకా సాగుతూనే ఉన్నాయి. ప్రణాళికల ప్రకారం ఈ నెల మొదటి వారానికల్లా పనులు పూర్తి అయితేనే ప్రకృతి వైపరీత్యాల నుంచి రైతులు గట్టెక్కే పరిస్థితి ఉంటుంది. వచ్చే ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబర్ నెలల్లో తుపానులు, వరదలు వచ్చే ప్రమాదం పొంచి ఉంది. దీంతో రైతులకు పంట చేతికందే చివరి దశలో నష్టాలు వచ్చే అవకాశం ఉంటుంది. ఈ తరుణంలో భారీ నష్టం తప్పేలా కనిపించడం లేదని రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారుల ప్రణాళిక ప్రకారం అక్టోబరు 31 నాటికల్లా కోతల పనులు పూర్తి కావాల్సి ఉంది. కానీ అధికారులు అంచనా వేసిన లక్ష్యానికి సుదూరంగా వాస్తవ పరిస్థితులు కనిపిస్తున్నాయి.

అరకొరగా పూడిక పనులు..?

గోదావరి నుంచి ఇప్పటికే కాలువల ద్వారా విడుదల చేసినా నేటికీ రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరందని పరిస్థితి నెలకొంది. ఎక్కడికక్కడ కాలువల్లో పూడిక పేరుకుపోవడం ప్రధాన సమస్యగా మారింది. పూడిక పనులు కొత్త ప్రభుత్వం కూడా సక్రమంగా చేపట్టకపోవడంతో సాగు పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతుందని రైతులు వాపోతున్నారు. పుష్కలమైన సాగునీరు అందుబాటులో ఉన్నా గుర్రపు డెక్క, తూటి కాడ పెరుకుపోయి నీటి ప్రవాహాన్ని అడ్డుకుంటున్నాయి. క్లోజర్ పనులు కూడా సక్రమంగా జరగడం లేదని పలువురు రైతులు వాపోతున్నారు. శివారు ప్రాంతాలకు సాగు నీరు అందని పరిస్థితుల్లో బోర్లపైనే చాలా మంది రైతులు ఆధారపడుతున్నారు. కొన్ని ప్రాంతాలకు ప్రస్తుతం సక్రమంగానే సాగునీరు అందుతున్నా చాలా ప్రాంతాలకు చుక్కనీరు కూడా రావడం లేదు.

రంగరాయ ఘటనలో నిందితుల అరెస్టు

ప్రజాశక్తి-కాకినాడ

రంగరాయ వైద్య కళాశాల విద్యార్థినులపై లైంగిక వేధింపుల సంఘటనలో నిందితులు లాబ్ అటెండెంట్, లాబ్ టెక్నీషియన్లను విధుల నుంచి సస్పెండ్ చేసి, క్రిమినల్ కేసులు నమోదు చేశామని కలెక్టర్ షాన్ మోహన్ సగిలి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఎస్‌పి జి.బిందుమాధవ్‌తో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 9న రంగరాయ వైద్య కళాశాలలో పారామెడికల్ కోర్సు చదువుతున్న 60 మంది విద్యార్థులు లాబ్ అసిస్టెంట్ వి.కళ్యాణ చక్రవర్తి తమపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్టు కళాశాల ప్రిన్సిపల్‌కు ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై ప్రిన్సిపల్ వెంటనే స్పందించి ఇంటర్నల్ కమిటీ విచారణకు అప్పగించారని తెలిపారు. కమిటీ విచారణలో 55 మంది విద్యార్థినుల ఫిర్యాదులోని ఆరోపణలు నిజమని నిర్ధారణ అయ్యిందని తెలిపారు. కమిటీ నివేదిక ఆధారంగా నలుగురు ఉద్యోగులను రంగరాయ వైద్య కళాశాల ప్రిన్సిపల్ సస్పెండ్ చేసి, వారిపై స్థానిక వన్ టౌన్, టూ టౌన్ పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేశారని, శుక్రవారం వారందరినీ అరెస్ట్ చేశారని తెలిపారు. వీరిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారని తెలిపారు. ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేసిన విద్యార్థినులను, ఫిర్యాదుపై తక్షణ విచారణ నిర్వహించి వారిలో వ్యవస్థ పట్ల విశ్వాసాన్ని నింపిన ఆర్ఎంసి ప్రిన్సిపల్, విచారణ కమిటీలను జిల్లా కలెక్టర్ అభినందించారు. ఈ సంఘటన నేపథ్యంలో విద్యార్థినులు, పని చేసే మహిళలపై లైంగిక అకృత్యాలను నిరోధించేందుకు జిల్లాలోని అన్ని పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాల్లో మహిళల రక్షణకు ఏర్పాటైన అంతర్గత కమిటీలను మరింత బలోపేతం చేస్తామన్నారు. ఎస్‌పి బిందుమాధవ్ మాట్లాడుతూ ఈ సంఘటనలో నిందితులు నలుగురినీ వెంటనే అరెస్టు చేశామని, సంబంధిత సెక్షన్ల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో రంగారాయ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్, జిజిహెచ్ ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ డాక్టర్ పి.శ్రీనివాసన్, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్, ఎస్‌పి

ఆర్మీ రిక్రూట్‌మెంట్, హాకీ టోర్నమెంట్‌కు ఏర్పాట్లు

ప్రజాశక్తి-కాకినాడ

ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ, అండర్- 19 హాకీ టోర్నమెంట్ పోటీల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. స్థానిక స్పోర్ట్స్ అథారిటీ మైదానంలో ఆగస్టులో ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ, అండర్-19 హాకీ టోర్నమెంట్ పోటీల ఏర్పాట్లపై శుక్రవారం జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా రెవెన్యూ, మున్సిపల్, రోడ్డు భవనాలు, పౌరసరఫరాల, ట్రాన్స్‌పోర్ట్, ట్రాఫిక్ పోలీసులు ఇతర శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. హాకీ ఫీల్డ్‌లో చేయాల్సిన ఏర్పాట్లు, మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్ సరఫరా, పారిశుధ్యం, వసతి, భోజన సదుపాయాలకు సంబంధించి అనువైన ప్రదేశాలను పరిశీలించారు. క్వాష్ కోర్టు, వెయిట్ లిఫ్టింగ్, డిఎస్ఎ భవనాలను కలెక్టర్ పరిశీలించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా మాట్లాడుతూ ఆగస్టు ఒకటి నుంచి 12వ తేదీ వరకు జాతీయ జూనియర్ మహిళల హాకీ ఛాంపియన్‌షిప్ పోటీలు, ఆగస్టు 3 నుంచి 20వ తేదీ వరకు ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ జిల్లా క్రీడా మైదానం వేదికగా నిర్వహిస్తామన్నారు. ఈ పరిశీలనలో డిఆర్ఒ జె.వెంకటరావు, ఆర్‌డిఒ ఎస్.మల్లి బాబు పాల్గొన్నారు.



మైదానంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

పారిశుధ్యంపై జిల్లా పంచాయతీ అధికారి తనిఖీ

ప్రజాశక్తి -కరప

కరప గ్రామపంచాయతీలో పారిశుధ్యాన్ని జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్ శుక్రవారం పరిశీలించారు. ఐవిఆర్ఎస్ కాల్స్‌పై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఇఒపిఆర్‌డి సలాది శ్రీనివాసరావునపు ఆదేశించారు. గ్రామాల్లో క్లాస్ మిత్రాస్ డోర్ టు డోర్ వెళ్లి గార్బేజ్ కలెక్షన్ సక్రమంగా నిర్వహించేలా చూడాలని అధికారులకు తెలిపారు. వాటర్ ట్యాంకులను పర్యవేక్షించి క్లోరినేషన్ సక్రమంగా చేసి సురక్షిత మంచినీటిని ప్రజలకు అందించాలని పేర్కొన్నారు. తడి పొడి చెత్తలను వేరువేరుగా కలెక్షన్ చేసి చెత్త నుండి సంపద కేంద్రాలకు తరలించి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ప్రభుత్వం ఐవిఆర్ఎస్ కాల్స్ ద్వారా పంచాయతీ సిబ్బంది ఇంటింటికీ సర్వే చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నిర్మలాదేవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దేశ వ్యాప్తంగా దళితులపై కుట్ర

ప్రజాశక్తి - జగ్గంపేట, గండేపల్లి

దేశవ్యాప్తంగా దళితులపై దారుణమైన కుట్ర జరుగుతోందని మాలమహానాడు అధ్యక్షుడు ఆర్ఎస్.రత్నాకర్ ఆరోపించారు. శుక్రవారం ఆయన జగ్గంపేటలో మీడియాతో మాట్లాడారు. మోడీ ప్రభుత్వం వర్గీకరణ పేరుతో కులాల మధ్య చిచ్చు రేపుతోందన్నారు. రిజర్వేషన్‌ను మరో 10 శాతం కల్పించి మిగిలిన కులాలకు ఇవ్వాలని, అంతేకానీ ఉన్నదాన్ని సమానంగా పంచాలని చూడటం సమంజసం కాదని తెలిపారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఉన్న రిజర్వేషన్‌ను 59 కులాలకు సమానంగా అమలు చేసేందుకు సిద్ధపడుతున్నారని ఇదేమీ సామాజిక న్యాయం అని ప్రశ్నించారు.

ఆదిత్యలో జనాభా దినోత్సవం

ప్రజాశక్తి-కాకినాడ

స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, గణాంక శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్టు ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్.నాయుడు తెలిపారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా వక్తృత్వ పోటీలు ఆదిత్య డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాయుడు మాట్లాడుతూ మానవ వనరుల అభివృద్ధి ఆరోగ్యకరంగా ఉన్నప్పుడే దేశం మరింత అభివృద్ధి చెందుతుందని, మానవ వనరుల వినియోగం సరైన రీతిలో ఉన్నప్పుడు దేశం ఆర్థికంగా బలపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా పోటీల్లో జె.మహేశ్వరి, కె.చంద్రిక ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు డాక్టర్ నాయుడు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను అందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, ఇన్‌ఛార్జి మూర్తి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి టి.తేజేశ్వరరావు, స్టాటిస్టిక్స్ విభాగాధిపతి సత్యనారాయణ, డి.అశ్విని, మణిరత్నం పాల్గొన్నారు

జాబ్ మేళాలో 8 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి-కాకినాడ

ధరిత్రి అడ్వైజరీ ప్రైవేట్ లిమిటెడ్ టెలీ కాలర్ ఉద్యోగాల కోసం నిర్వహించిన జాబ్ డ్రైవ్ విజయవంతమైందని ఎఎస్‌డి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.అనంతలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ డ్రైవ్‌కు 18 మంది హాజరు కాగా 8 మంది ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు కాకినాడలో పని చేయాల్సి ఉంటుందని వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సువర్చల తెలిపారు.

లైంగిక వేధింపులపై కఠిన చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-కాకినాడ, పెద్దాపురం

కాకినాడ జిజిహెచ్‌లో పారామెడికల్ విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జిజిహెచ్ ఆవరణలో తల్లీ బిడ్డ విగ్రహం వద్ద సిఐటియు శ్రామిక మహిళ సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. కమిటీ జిల్లా కన్వీనర్ జి.బేబీరాణి, కో కన్వీనర్ చంద్రమళ్ల పద్మ మాట్లాడుతూ వివిధ విభాగాల్లో పారా మెడికల్ విద్యార్థినిలు ప్రతి నిత్యం శిక్షణ కోసం వస్తూ ఉంటారని తెలిపారు. కొంతమంది కామాంధులు మార్కుల పేరుతో విద్యార్థినులపై వేధింపులకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ల్యాబ్ టెక్నీషియన్ కళ్యాణ్ చక్రవర్తి, అతని టీమును ఉద్యోగాల నుండి తొలగించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ షాన్ మోహన్ సగిలికి వినతిపత్రం అందించారు. ఈ ధర్నాలో జి.రామలక్ష్మి, సిహెచ్.వేణు, ఎం.నాగలక్ష్మి, జె.లక్ష్మీప్రియ, దడాల పుష్పరాగం, పద్మ, రాజీ, కె.భాగ్యలక్ష్మి, కృష్ణవేణి, ఎం.కుమారి, మంగతాయారు, రాజు తలుపులమ్మ, సిఐటియు జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషబాబ్జి, మలకా వెంకటరమణ, పలివెల వీరబాబు, మేడిశెట్టి వెంకటరమణ, ఆర్.రమేష్, వివిఎన్ కుమార్, శ్రీకాంత్, ఏసూరి శ్రీనివాస్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



పెద్దాపురంలో ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

లైంగిక వేధింపులపై తక్షణం చర్యలు తీసుకోవాలని ఐద్వా రాష్ట్ర సహాయకార్యదర్శి సిహెచ్.రమణి, జిల్లా కార్యదర్శి వరలక్ష్మి, నగర అధ్యక్ష కార్యదర్శులు భూలక్ష్మి, కె.నాగజ్యోతి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.



కాకినాడలో ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

పెద్దాపురం లైంగిక వేధింపుల ఘటనపై స్థానిక మున్సిపల్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద శ్రామిక మహిళా సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. సిఐటియు నాయకులు దాడి బేబీ మాట్లాడుతూ ఇటువంటి సంఘటనలు పునరావతం కాకుండా దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్నేహలత, సీత, చంటి, జ్యోతి, దేవి, ఇందిరా ప్రియదర్శిని, మున్ని, గడిగట్ల సత్తిబాబు, డి.క్రాంతి కుమార్, శ్రీనివాస్, కృష్ణ, సూరిబాబు పాల్గొన్నారు.

మెప్మా అధికారిగా శ్రీదేవి

ప్రజాశక్తి-గొల్లప్రోలు

నగర పంచాయతీ పరిధిలోని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ అధికారిగా జి.శ్రీదేవి నియమితులయ్యారు. గురువారం ఆమె తమ కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు. తుని పట్టణం నుండి ఆమె బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ మహిళా సంఘాలను బలోపేతం చేయడానికి కషి చేస్తానన్నారు.

మరిడమ్మను దర్శించుకున్న ట్రాఫిక్ డిఎస్‌పి

ప్రజాశక్తి - పెద్దాపురం

మరిడమ్మ జాతర సందర్భంగా శుక్రవారం విజయవాడ ట్రాఫిక్ డిఎస్‌పి రామచంద్ర రావు మరిడమ్మ అమ్మవారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజల అనంతరం వేదాశీర్వచనాలతో అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కె.విజయలక్ష్మి, వేద పండితులు, ఆసాదులు పాల్గొన్నారు.

జనాభా నియంత్రణ సుస్థిర భవితకు మార్గం

ప్రజాశక్తి-కాకినాడ

స్థానిక ఐడియల్ డిగ్రీ కళాశాలలో ఎకనామిక్స్, ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యాన శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహనా సదస్సుకు అధ్యక్షత వహించిన అర్థశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ జి.స్టీవెన్ రాజు మాట్లాడుతూ పెరుగుతున్న జనాభా మానవాభివృద్ధికి పెను విఘాతమని పేర్కొన్నారు. పెరుగుతున్న జనాభాను మానవ వనరులుగా మార్చుకోవడం ద్వారా అభివృద్ధి సాధించవచ్చని పేర్కొన్నారు. ప్రపంచ జనాభా, మేధోవలస, సాంకేతిక నైపుణ్యత వంటి విషయాలపై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా వ్యవహరించిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.సత్యనారాయణ మాట్లాడుతూ నేడు ప్రపంచ వ్యాప్తంగా అధిక జనాభా వల్ల ఆహార సమస్య ఏర్పడుతోందని, దీనివల్ల ప్రపంచ దేశాల మధ్య వలసల కారణంగా తీవ్ర వివాదాలు తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. నేటి యువత అందరూ తమ కాళ్ళపై తాము ఆధారపడిన తర్వాతే భవిష్యత్ అవసరాల దష్యా ఆలోచన చేయాలని హితవు పలికారు. కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్, కామర్స్ హెడ్ వి.నాగేశ్వరరావు, అర్థశాస్త్ర అధ్యాపకులు డి.విశ్వనాథ రాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎన్.శంకర్ ప్రసాద్, వైఆర్ఎల్.చౌదరి పాల్గొన్నారు.

రహదారి సౌకర్యం కల్పించాలని మొర

ప్రజాశక్తి- తాళ్లరేవు

దశాబ్దాలుగా తమ గృహాలకు ఉన్న దారిని అన్యాయంగా కొందరు మూసి వేశారని, తమకు రహదారి సౌకర్యం కల్పించాలని పలువురు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం జార్జిపేట వద్ద విలేకరులతో వారు మాట్లాడారు. జార్జిపేట, పోలేకుర్రు సరిహద్దుకు చెందిన ప్రాంతంలో కొన్నేళ్ల క్రితం గుత్తుల సత్యనారాయణ మూర్తి, వాసంశెట్టి సత్య సురేఖ, గుత్తుల వెంకటేశ్వరరావు, వాసంశెట్టి నిర్మల, దంగేటి నీలమ్మ, పిల్లి సుబ్బన్న, దంగేటి నాగ వెంకటలక్ష్మి కుటుంబాలు భూములు కొనుగోలు చేసుకున్నారని, వారిలో కొన్ని కుటుంబాలు ఇళ్ల నిర్మాణాలు చేసుకోగా మరికొందరు నిర్మాణాలకు సిద్ధపడ్డారు. 2022లో సరిహద్దున ఉన్న కొందరు ఆ భూముల్లోకి వెళ్ళే రహదారికు కంచెవేసి మూసివేశారని, దీంతో తమకు కష్టాలు మొదలయ్యాయని తెలిపారు. కట్టుకున్న ఇళ్లల్లోకి వెళ్లడానికి దారి లేక డొంకల్లోంచి వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గత మూడేళ్లుగా ఇళ్ల స్థలాలు, ఇళ్లు ఉన్నా వాటికి వెళ్లే మార్గం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని బాధితులు వాపోయారు. దీనిపై జిల్లా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశామని తెలిపారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు తహశీల్దారు పి.త్రినాథరావు బృందం వచ్చి తొలగించే ప్రయత్నం చేసినా ఆక్రమణదారులు అడ్డుకున్నారని తెలిపారు. దీనిపై తహశీల్దారు త్రినాథరావు మాట్లాడుతూ రహదారికి అడ్డుగా కంచె వేయడం చట్టరీత్యా నేరమని, త్వరలోనే పోలీసుల సహకారంతో రహదారికి వేసిన కంచె తొలగించి మార్గాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు.




రహదారి సౌకర్యం కల్పించాలని మొర పెట్టుకుంటున్న బాధితులు

మన పెద్దాపురం టీమ్ సేవలు మరువలేనివి

ప్రజాశక్తి - పెద్దాపురం

మన పెద్దాపురం ఫేస్బుక్ బందం చేస్తున్న సేవలు వెలకట్టలేనివని డిసిసిబి చైర్మన్ తుమ్మల బాబు అన్నారు. మరిడమ్మ అమ్మవారి జాతర సందర్భంగా యాత్రికులకు మన బృందం ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన అన్నదానాన్ని బాబు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మన పెద్దాపురం ఫేస్బుక్ బందం ఏర్పడిన నాటి నుంచి చేస్తున్న వినూత్న సేవా కార్యక్రమాలు అందరికీ ఆదర్శంగా నిలిచాయన్నారు. ఇప్పటికే ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవల కోసం వచ్చే గర్భిణులకు అన్నదానం నిర్వహిస్తూ ఆదర్శంగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి, ఎస్ఐ వి.మౌనిక, జనసేన పట్టణ అధ్యక్షులు పొలమరశెట్టి సత్తిబాబు, టిడిపి పట్టణ కార్యదర్శి తూతిక రాజు, ఫేస్బుక్ అడ్మిన్ పెదిరెడ్డి నరేష్, బృంద సభ్యులు కోరుకొండ ప్రశాంత్, మార్ని చిన్న, చల్లా జయశ్రీ, దేవత రాజేష్ కుమార్, లక్ష్మి, దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు సకురు సక్కు, చంద్రముఖి, వంగలపూడి సతీష్, పలిశెట్టి రాజు తదితరులు పాల్గొన్నారు.

కార్టూన్ 'నిజం'



ప్రయాణ భద్రతపై డ్రైవర్లకు అవగాహన

విద్యార్థుల ప్రయాణ భద్రతపై పోలీసులు శుక్రవారం అవగాహన కల్పించారు.

ప్రజాశక్తి -యంత్రాంగం

పెద్దాపురం ఆటోల ప్రయాణ భద్రతపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీసులు అవగాహన సదస్సు నిర్వహించారు. సామర్లకోట రహదారి స్వర్ణ దేవాలయం వద్ద ఉన్న హెలిపాడ్ గ్రౌండ్‌లో సిఐ జయశంకర్ అధ్యక్షతన ఆటో డ్రైవర్లు, ఓనర్లకు అవగాహన కల్పించారు. సిఐ జయశంకర్ మాట్లాడుతూ మండల పరిధిలో 495 ఆటోలు ఉన్నాయన్నారు. ఈ ఆటోల డ్రైవర్లందరూ ప్రయాణ భద్రతపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించటం వల్ల ప్రమాదాలను నివారించవచ్చున్నారు, ఎస్ఐ వి.మౌనిక ఆధ్వర్యంలో పోలీసులు ప్రతి ఆటోకు ఆటో, డ్రైవర్ వివరాలతో కూడిన చార్ట్ ఏర్పాటు చేశారు.

పిఠాపురం విద్యార్థులను తరలించే విద్యాసంస్థల బస్సు డ్రైవర్లు నిబంధనలు పాటించాలని, బస్సులు ఫిట్‌నెస్ కలిగి ఉండాలని పిఠాపురం సిఐ జి.శ్రీనివాస్ తెలిపారు. ఎస్ఐ వి.మణికుమార్, సిబ్బందితో కలిసి పట్టణ పరిధిలోని పాఠశాలలు, కళాశాలలకు సంబంధించిన బస్సులను, ఆటోలను ఇతర వాహనాలను తనిఖీ చేశారు. వాటి ఫిట్‌నెస్, డాక్యుమెంట్స్‌ను పరిశీలించారు.



బస్సులను తనిఖీ చేస్తున్న పోలీసులు

కిర్లంపూడి ఆటోవాలాలు పరిమితికి మించి విద్యార్థులను ఎక్కిస్తే కఠిన చర్యలు తప్పవని కిర్లంపూడి ఎస్ఐ జి.సతీష్ కుమార్ హెచ్చరించారు. జగపతినగరంలో ప్రగతి స్కూల్లో ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరు యూనిఫాం, డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండడంతోపాటు వాహన పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. విద్యార్థులని ఆటోలో డ్రైవర్ పక్కన, చెక్కలపై, వెనుక వైపు కూర్చోబెట్టరాదన్నారు. విద్యార్థులను చేరవేసే ఆటోలు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు.

బాలల రక్షణ చట్టాలపై శిక్షణ

ప్రజాశక్తి-గొల్లప్రోలు

బాల్య వివాహాల నివారణపై విస్తతంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా బాలల పరిరక్షణ అధికారి సిహెచ్.వెంకట్రావు తెలిపారు. శుక్రవారం జిల్లా స్త్రీ శిశుసంక్షేమ శాఖ పిఒ సిహెచ్.దుర్గాదేవి అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం చట్టాలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా బాలల సంరక్షణ అధికారి విజయ, జిల్లా పరిరక్షణ అధికారి సిహెచ్.వెంకట్రావు మాట్లాడారు. బాల్యవివాహాల నివారణ బాధ్యత అధికారులందరికీ ఉందన్నారు. బాల్య వివాహాలు ఒక సామాజిక రుగ్మత అని దీన్ని నిర్మూలించడానికి విస్తతంగా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని, ఎవరైనా బాల్యవివాహాలు నిర్వహిస్తే వారిపై కఠిన చర్యలతో పాటు వారు పొందే సంక్షేమ పథకాలు రద్దు చేయాలన్నారు. 18 ఏళ్లు నిండకుండా వివాహ సర్టిఫికెట్ ఇచ్చిన వారిపై చర్యలు తప్పవన్నారు. బాల్య వివాహాలు చేస్తే రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.లక్ష జరిమానాతో విధిస్తారని తెలిపారు. ఎక్కడైనా బాల్యవివాహాలు జరుగుతుంటే 1098 చైల్డ్‌లైన్ టోల్‌ఫ్రీ నెంబర్‌కు తెలియజేయాలన్నారు. పోక్సో చట్టంపై చైల్డ్ హెల్ప్‌లైన్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి.దుర్గారాణి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ మానసా దేవి, ఎం.దేవకుమారి పాల్గొన్నారు.

ఘనంగా ఇయు ఆవిర్భావ వేడుకలు

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ 74వ ఆవిర్భావ దినోత్సవాన్ని స్థానిక డిపోలో కార్మికులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో కార్యదర్శి యుబిఎం.కుమార్ మాట్లాడుతూ ఎంప్లాయీస్ యూనియన్ ఆవిర్భావం నుండి కార్మికుల సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేసిందన్నారు. డిపో వర్కింగ్ ప్రెసిడెంట్ బి.నానిబాబు, రీజనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంఆర్.కృష్ణ మాట్లాడుతూ 1952లో జూలై 11న సంఘం ఏర్పడిందన్నారు. యూనియన్ పోరాటం వల్ల వారానికి ఒక ఆఫ్, ఎనిమిది గంటల పని దినాన్ని, తొలి వేతన సవరణ ఒప్పందాన్ని సాధించిన ఘనత, ప్రివిలేజ్, బస్సు పాసులు, క్యాజువల్ వర్కర్ల రెగ్యులర్, సమాన పనికి సమాన వేతనం, యాక్సిడెంట్లలో డ్రైవర్లకు ఆర్థిక సహాయం, డ్రైవర్లకు ఇతర రక్షణలు లభించిన అగ్రిమెంట్లు సాధించినట్టు తెలిపారు. ఎన్‌వి.రావు, గంగ, జిఎస్.నారాయణ, ఎల్‌విఎస్.నారాయణ, విజయ, గ్యారేజీ చలం, ప్రసాద్, నల్ల శ్రీను, సిహెచ్.లోవరాజు, గంటా శ్రీను, బూరుగుపూడి రాజు, జక్కా శ్రీను పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో వ్యక్తి మరణం

ప్రజాశక్తి -దేవరపల్లి, గోపాలపురం

దేవరపల్లి మండలం గొల్లగూడెం గ్రామంలో శుక్రవారం ఉదయం విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతి చెందాడు. .పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గోపాలపురం మండలం వేళ్ళచింతలగూడెం గ్రామానికి చెందిన మందపాటి రాజేష్ (25) గొల్లగూడెంలో మెయిన్ రోడ్ పక్కన కరెంటు స్తంభానికి నిచ్చెన వేసుకొని కేబుల్ వర్క్ చేస్తున్నాడు. ఈ సమయంలో 11కెవి వైరు చేతికి తగిలి విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని వెంటనే గోపాలపురం ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. తండ్రి మందపాటి చంటియ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. రాజేష్ మృతి వార్తతో తల్లిదండ్రులు బోరున రోదిస్తున్నారు. వారిని సముదాయించడం ఎవరితరమూ కావట్లేదు. ఎదిగొచ్చిన కొడుక లేడనే నిజాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు. త్వరలోనే వివాహం చేద్దామనుకునే సరికి ఇలా జరగడంతో దుఖ:సాగరంలో మునిగిపోయారు.

రాజేష్ మృతి బాధాకరం : ఎంఎల్ఎ మద్దిపాటి

రాజేష్ అకాల మృతి బాధాకరమని ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు అన్నారు. రాజేష్ భౌతికకాయాన్ని ఆయన సందర్శించి నివాళు లర్పించారు. మతుడికి టిడిపి సభ్యత్వం ఉండడంతో రూ.5 లక్షల బీమా అందిస్తామని తెలిపారు. కుటుంబాన్ని ఆదుకుంటామన్నారు.

గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం

ప్రజాశక్తి - సీతానగరం

సీతానగరం మండలం సింగవరం గ్రామంలో శుక్రవారం గ్యాస్ సిలిండర్ పేలడంతో ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. సుమారు రూ.2లక్షల ఆస్తినష్టం సంభవించింది. గ్రామానికి చెందిన వీరమాచి పోసియ్యకు చెందిన ఇంటిలో గ్యాస్ బండ పేలడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి గడ్డి పాకను చుట్టుముట్టాయి. ఈ ప్రమాదంలో ఇంట్లో ఉన్న కాసు బంగారు మంగళ సూత్రాలు, రూ. 30 వేల నగదు, ఫ్రిజ్, తదితర వస్తువులు కాలి బూడిదయ్యాయి. బాధితులకు తక్షణ సాయంగా బియ్యం అందించారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి-రాజోలు

రాజోలు సుందరమ్మ చెరువుగట్టుకు చెందిన దీపాటి మణి రావు (38) మృతి పై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మణిరావు గురువారం తాపీ పనికి వెళ్ళి రాత్రి ఇంటికి తిరిగి వచ్చాడు. శుక్రవారం ఉదయం ఇంటి బయట శవమై కనిపించాడు. మృతుడు స్వస్థలం మలికిపురం మండలం లక్కవరం. ఉపాధి రీత్యా దుబాయ్ దేశం వెళ్లి ఏడాది క్రితం తిరిగి వచ్చాడు. అప్పటి నుంచి రాజోలులో అత్తవారి ఇంటి వద్ద ఉంటూ అప్పుడప్పుడు తల్లిని చూసేందుకు లక్కవరం వెళు తుంటాడు. రోజు మాదిరిగానే పని నుంచి రాత్రి ఇంటికితిరిగి వచ్చిన అతను తెల్లవారే సరికి ఇంటి బయట మతి చెంది ఉండటం పలు అనుమానాలకు తావిస్తుంది. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుని భార్య దీపాటి స్వర్ణ లత ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజేష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేలు ముందు తాగి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-గొల్లప్రోలు

పేలు ముందు తాగి ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చేబ్రోలు ఇబిసి కాలనీలో నివాసముండే మాగిరెడ్డి పాండవులు (49) తన ఇంటి వద్ద మద్యం ఎక్కువగా తాగాడు. తరువాత మద్యం మత్తులో పేలు మందు కలుపుకుని తాగాడు. వెంటనే భార్య చూసి పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. పాండవులుకు మగ్గురు పిల్లలు ఉన్నారు. పెద్ద కుమారుడు నాగబాబు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు.

బిఎల్ఒలకు ఓటర్ లిస్ట్‌పై శిక్షణ

ప్రజాశక్తి - పెద్దాపురం

పోలింగ్ కేంద్రాల బూత్ లెవెల్ అధికారులకు శుక్రవారం స్థానిక తహశీల్దారు కార్యాలయంలో ఓటర్ లిస్ట్ సంస్కరణలపై డిప్యూటీ తహశీల్దారు టి.కాంతారావు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణలో భాగంగా ఆయన బిఎల్ఒల బాధ్యతలు, ఓటర్ నమోదు, ఓటర్ తొలగింపు, సవరణ, వలస కార్మికుల సమాచారం అప్‌డేట్ విధానాలపై ప్రత్యేక అవగాహన కల్పించారు. ఇఆర్ఒఎన్ఇటి, గరుడ యాప్‌ల వినియోగంపై శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణా తరగతులు తహశీల్దారు సిహెచ్.వెంకటలక్ష్మి అధ్యక్షతన జరిగాయి.

ఘనంగా జనాభా దినోత్సవం

ప్రజాశక్తి-గొల్లప్రోలు

పట్టణ ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ అమృత రావు ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించారు. జనాభా సమస్యల ఆవశ్యకత, ప్రాముఖ్యతపై హెచ్‌వి.లక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ ఆనంద్ వివరించారు. ఎఎన్ఎం చిన్ని పాల్గొన్నారు.

పరిశుభ్రతతో ప్రజారోగ్య పరిరక్షణ

ప్రజాశక్తి - పెద్దాపురం

గ్రామం పరిశుభ్రంగా ఉంటే ప్రజారోగ్యం బాగుంటుందని డిఎల్‌డిఒ ఎం.శ్యామల అన్నారు. శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా ఆమె తిరుపతి గ్రామాన్ని సందర్శించి పరిశుభ్రతా పనులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఏరోజు చెత్త పోగులను ఆ రోజే తొలగించాలన్నారు. ప్రతిరోజు డ్రైన్లను పరిశుభ్రం చేయాలన్నారు. సర్పంచ్ మొయిళ్ల కృష్ణమూర్తి, డిప్యూటీ ఎంపిడిఒ జివి.శేఖర్ రెడ్డి, పంచాయితీ కార్యదర్శి యు.భార్గవ్ పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబం దత్తత

ప్రజాశక్తి - పెద్దాపురం

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బంగారు కుటుంబం కార్యక్రమంలో భాగంగా డిడిం ఎం.శ్యామల మండల పరిధిలోని రాయభూపాలపట్నం గ్రామానికి చెందిన రాచపల్లి దావీదు, మంగ నిరుపేద కుటుంబాన్ని దత్తత తీసుకున్నారు. శుక్రవారం ఆమె రాయభూపాలపట్నంలోని దావీదు కుటుంబాన్ని కలిసి వారి స్థితిగతులను, వారి అవసరాలను తెలుసుకున్నారు. వారి పిల్లల చదువుల గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ డి.శ్రీలలిత, పంచాయితీ కార్యదర్శి ఫణి కుమామార్ పాల్గొన్నారు.

యానాం వార్తలు

ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవం

ప్రజాశక్తి - యానాం

భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ మేరా యువభారత్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌టిపిపి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళాశాల ప్రిన్సిపల్ జి.రత్నప్రభ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా కళాశాల ఉపాధ్యాయిని ఎస్.భవాని విద్యార్థులకు అవగాహన కల్పించారు.. ఈ కార్యక్రమంలో లీలా కుమారి, ప్రసన్నకుమారి, మై భారత్ సిబ్బంది మన్నే కిరణ్ కుమార్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బ్యాడ్మింటన్ పోటీలు

ప్రజాశక్తి - యానాం

స్థానిక వైఎస్ఆర్ ఇంటర్నేషనల్ ఇండోర్ స్టేడియంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో జోనల్ స్కూల్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఈ మేరకు శుక్రవారం అండర్ 14 బాలుర విభాగంలో బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. సుమారు 8 పాఠశాలల నుంచి 32 మంది విద్యార్థులు పాల్గొన్నట్టు సెక్రటరీ కొప్పనాతి భాస్కర్ తెలిపారు. ఈ పోటీలలో మహాత్మా గాంధీ గవర్నమెంట్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ప్రథమ స్థానం సాధించగా, ద్వితీయ స్థానంలో రీజెన్సీ పబ్లిక్ స్కూల్, తృతీయ స్థానంలో గిరియంపేట హైస్కూల్ విద్యార్థులు గెలుపొందారన్నారు. ఈ సందర్భంగా గెలుపొందిన వారిని ప్రాంతీయ విద్యాశాఖ అధికారి పంపన లక్ష్మణ ప్రవీణ్ అభినందించారు.



వికలాంగులకు ఉపకరణాలు అందజేస్తున్న ఆర్ఎఒ మునిస్వామి, ఇతరులు

వికలాంగులకు ఉపకరణాల పంపిణీ

ప్రజాశక్తి - యానాం

సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వికలాంగులు, ఇతరులకు చిల్డ్రన్స్ ఆడిటోరియంలో శుక్రవారం ఉపకరణాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ప్రాంతీయ పరిపాలన అధికారి ఆర్.మునిస్వామి పాల్గొని వికలంగులకు పరికరణాలు అందజేశారు. ఈ సందర్భంగా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి సూరంపూడి రాజేంద్ర మాట్లాడుతూ 532 మందికి కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వశాఖ రూ.40 లక్షల విలువైన వివిధ ఉపకరణాలు, వాహనాలు మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థ ఆర్ఇసి లిమిటెడ్ సామాజిక బాధ్యత నిధులతో అలిస్కో సంస్థ తయారు చేసిన పలు ఉపకరణాలు, వాహనాలను అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బుద్ధి అఖిల్, డిటి.జ్యోతి వెంకటేశ్వరావు, కమిడి ప్రభాకర్ ఆర్ఇసి ప్రతినిధులు పాల్గొన్నారు.

పలుచోట్ల సుపరిపాలన, తొలి అడుగు

ప్రజాశక్తి - సామర్లకోట, గండేపల్లి, తాళ్లరేవు

సామర్లకోట మండలం హుస్సేన్‌పురంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో టిడిపి యువ నాయకుడు నిమ్మకాయల రంగనాగ్ పాల్గొన్నారు. ఆయనకు చల్లా బుజ్జి ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో తోటకూర శ్రీనివాస్, గుమ్మళ్ల రామకృష్ణ, ముసిరెడ్డి శ్రీరాములు, చీకట్ల వెంకటేష్, కొప్పిరెడ్డి రాజా, బచ్చుల జమ్మి, దమ్మాల శ్రీను, చల్లా బుజ్జి, తలారి శ్రీను, పలివెల చంద్రశేఖర్, గొల్లపల్లి సర్వేశ్వరరావు, కుర్ర రాజు పాల్గొన్నారు.

గండేపల్లి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జగ్గంపేట ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ అన్నారు. గండేపల్లిలోని వెంకన్న బాబు గుడి వీధి, శెట్టిబలిజిపేటలో ఎంఎల్ఎ సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పోతుల మోహనరావు, గండేపల్లి సొసైటీ చైర్మన్ కంటిపూడి సత్యనారాయణ, బొల్లంరెడ్డి రామకృష్ణ, వెలమాటి కాశి, చాగంటి సత్యనారాయణమూర్తి, సుంకవల్లి రమేష్, ఇప్పర్ల సురేష్, వెంపాటి రాజు, సుంకవిల్లి రమేష్, వెంపాటి సతీష్, చిటికెల కన్నబాబు, ఉప్పలపాటి సత్తిబాబు, ఆళ్ల సత్తిబాబు, పైలా వెంకన్న, ఎల్.రామకృష్ణ, కంటిపూడి సతీష్, ఎం.సూర్యారావు పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ దాట్ల సుబ్బరాజు

తాళ్లరేవు సుంకరపాలెం చెక్ పోస్టు వీధిలో ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు ప్రతి ఇంటికీ తిరిగి ప్రజలతో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మోపూరి వెంకటేశ్వరరావు, సర్పంచ్ టిల్లపూడి నాగేశ్వరరావు, టిడిపి నాయకులు మోపూరి రెడ్డి నాయుడు, సాగి బాబ్జిరాజు, వేగేశ్న భాస్కరరాజు, చీకట్ల నాగేశ్వరరావు, తాతపూడి నాగేశ్వరరావు, నాగాబత్తుల బాలకృష్ణ, వంగా వీరబాబు, కవల కోటేశ్వరరావు, మర్రి అశోక్, పితాని అర్జునరావు, కుడుపూడి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలపై అవగాహన కల్పించాలి

కాజులూరు : ఎన్నికల నిబంధనలపై ఓటర్లకు అవగాహన కల్పించాలని తహశీల్దారు జి.రవీంద్రనాథ్ ఠాగూర్ తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో బూత్ లెవెల్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షకులు దంగేటి నరేష్ కుమార్ బూత్ లెవెల్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా నరేష్ కుమార్ మాట్లాడుతూ బూత్ లెవెల్ అధికారులు నిబంధనలు అవగాహన చేసుకుని ఓటర్లకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిటి శ్రీనివాస్, ఆర్ఐ వేగేశ్వరరావు పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణాలపై అవగాహన

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ఏలేశ్వరం నగర పంచాయతీ రహదారుల నిర్మాణాలపై చైర్‌పర్సన్ అలమండ సత్యవతి చలమయ్య అధ్యక్షతన శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో కాకినాడ ఉప ప్రణాళిఖాధికారి సత్యనారాయణ రాజు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 2026 ఆర్థిక సంవత్సరం నుంచి డ్రాఫ్ట్ ప్లాన్ సిద్ధం చేసినట్టు తెలిపారు. దీనిలో భాగంగా మండల పరిధిలోని తిరుమాలి, లింగంపర్తి, సి.రాయవరం, ఏలేశ్వరం మున్సిపాలిటీలో విలీనం చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. రోడ్ల నిర్మాణంపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు అభ్యంతరాలు ఏమైనా ఉంటే సంబంధిత రైతులు తమకు తెలియజేయాలన్నారు. రానున్న పదేళ్ల లోపు ఈ ప్రక్రియను పూర్తి చేస్తామని తెలిపారు. పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్ ప్రణాళికలు రూపొందించామన్నారు. ఈ సదస్సులో శిడగం వెంకటేశ్వరరావు, బదిరెడ్డి గోవింద్ బాబు, మసిరపు నాగేశ్వం రావు, కమిషనర్ ఎం.సత్యనారాయణ, సహాయ ప్లానింగ్ అధికారి కృష్ణారావు, జూనియర్ ప్లానింగ్ అధికారి శివరామకృష్ణ, టౌన్ ప్లానింగ్ అధికారి జెడి ఆనంద్ కుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రణాళికాధికారి

చంద్రబాబు మోసాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా చంద్రబాబు చేసిన మోసాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముద్రగడ గిరిబాబు పిలుపు ఇచ్చారు. శనివారం కిర్లంపూడిలో మాజీ మంత్రి, పార్టీ పిఎసి సభ్యుడు ముద్రగడ పద్మనాభం నివాసంలో విస్తత సమావేశం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి శాసనమండలి ప్రతిపక్ష నేత, పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని నాయకులు కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులకు సత్కారం

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో పని చేసి బదలీపై వెళ్లిన హెచ్ఎం యు.మీనా మాధూరి, ఉపాధ్యాయులు వాణీప్రభ, భారతి లక్ష్మి, సుగుణ, శ్రీదేవిని శుక్రవారం ఘనంగా సత్కరించారు. పాఠశాల హెచ్ఎం రాయుడు విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ పి.పుల్లయ్య, మానవ హక్కుల సంఘం అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ, కౌన్సిలర్ పాలికి కుసుమ చంటిబాబు మాట్లాడారు. బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులందరూ ఎంతో నిబద్ధతతో, అంకితభావంతో పని చేసి పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. అనంతరం పాఠశాలకు నూతనంగా వచ్చిన ఉపాధ్యాయులను పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు హనుమంతరావు, గురు ప్రకాష్, లక్ష్మణ్ దొర, సతీష్, ఇందిర, మహాలక్ష్మి, సరస్వతి, శర్మ, కమిటీ వైస్ చైర్మన్ పచ్చాకుల లోవరాజు, మాజీ చైర్మన్ రమణ,సభ్యులు పాల్గొన్నారు.

ఆదిత్యలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ముగింపు

ప్రజాశక్తి-గండేపల్లి

సూరంపాలెంలోని ఆదిత్య, కాకినాడలోని జెఎన్‌టియు సంయుక్తంగా 5 రోజుల ఫాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామును విజయవంతంగా నిర్వహించినట్టు ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపల్ డాక్టర్ రవి శంకర్, జెఎన్‌టియు కాకినాడ ఫార్మసీ హెడ్ డాక్టర్ బి.భవాని తెలిపారు. ఈ నెల 7 నుంచి 11 వరకూ రీసెంట్ అడ్వాన్స్ అండ్ ఫ్యూచర్ పర్స్పెక్టివ్స్ ఇన్ ఫార్మకోగ్నసీ అనే అంశంపై నాలుగు సెషన్స్ నిర్వహించి, ప్రతి సెషన్స్‌లోనూ ప్రఖ్యాతి చెందిన యూనివర్సిటీస్, ఇన్‌స్టిట్యూట్స్ నుంచి సైంటిస్ట్స్, రీసెర్చర్స్, ప్రొఫెసర్స్ ముఖ్య వక్తలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిలు పాల్గొని తమ రీసెర్చ్ అనుభవాలను పంచుకున్నారు. ఈ ప్రోగ్రామ్‌లో, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా హెర్బల్ మెడిసిన్స్‌లో నాణ్యత నియంత్రణ, ప్రమాణీకరణ, టార్గెటెడ్ డ్రగ్ డెలివరీ వ్యవస్థ ఎలా అభివృద్ధి చెందుతున్నాయన్న అంశాలపై విస్తృత చర్చ చేశారు.

మరిడమ్మకు ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - పెద్దాపురం

మరిడమ్మ అమ్మవారికి శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో వేద పండితులు ఐవి.ప్రసాద్ శర్మ, ఎన్‌వి.అవధాని, శంకర్, ఆసాదులు రాయి నాని, రామచంద్ర ప్రసాద్ తదితరుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

ప్రణాళికాబద్ధమైన మాతృత్వం అవసరం

ప్రజాశక్తి -తాళ్లరేవు

ప్రణాళికాబద్ధమైన మాతత్వం కోసం గర్భధారణ మధ్య ఆరోగ్యకరమైన సమయం, అంతరం పాటించాలని గాడిమొగ పిహెచ్‌సి వైద్యురాలు జయ భార్గవి అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గాడిమొగలో నిర్వహించిన ర్యాలీలో ఆమె మాట్లాడారు. ప్రతి స్త్రీ సరైన వయసుతో పాటు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉన్నప్పుడు మాత్రమే మాతా శిశు మరణాలు సంభవించకుండా ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది రంజన్, రాణి, కుమార్, ఆంజనేయులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై శ్రద్ధ వహించాలి

ప్రజాశక్తి-గండేపల్లి

గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని డిఎల్‌పిఒ బాలమణి అన్నారు. శుక్రవారం మండలంలోని నీలాద్రిపేట, తాళ్లూరు, రాజంపేట, గండేపల్లిలో పొడి చెత్త, తడి చెత్త సేకరణను ఆమె పరిశీలించారు. కేంద్రాలను తనిఖీ చేశారు. సేకరణ ఏ విధంగా చేస్తున్నారో పంచాయతీ కార్యదర్శి ఫణీంద్రకుమార్‌ను అడిగి తెలుసుకున్నారు.

హెల్మెట్, ర్యాష్ డ్రైవింగ్‌పై సిఐ తనిఖీలు

ప్రజాశక్తి - సామర్లకోట

హెల్మెట్, ర్యాష్ డ్రైవింగ్, లైసెన్స్‌లపై సామర్లకోట ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద సెంటర్లో పెద్దాపురం సిఐ విజయ శంకర్ శుక్రవారం విస్తత తనిఖీలు చేపట్టారు. హెల్మెట్లు లేకుండా ప్రయాణించే ద్విచక్ర వాహనదారులను, లైసెన్సులు లేకుండా వాహనాలను నడిపే యువతను, ర్యాష్ డ్రైవింగ్ చేసే యువతను నిలువరించారు. పోలీస్ యాప్ ద్వారా అపరాధ రుసుములు విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు నిబంధనలు పాటించి ప్రమాదాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ మౌనిక, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

ప్రజాశక్తి - జగ్గంపేట

ప్రజల సమస్యల తక్షణ పరిష్కారానికి ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ తెలిపరు. శుక్రవారం స్థానికటిడిపి కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. నియోజకవర్గంలోని పలువురు ప్రజలు తమ సమస్యలపై ఎంఎల్ఎ నెహ్రూకు వినతిపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో దాట్ల కృష్ణ వర్మ, టిడిపి మండల అధ్యక్షుడు మారిశెట్టి భద్రం, రేఖబుల్లి రాజు, ఎం.అప్పన్న దొర, బద్ది సురేష్, యల్లపు దొరబాబు, బత్తుల వెంకన్న, షేక్ వల్లి పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను వివరించాలి

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ వైసిపి బలోపేతానికి కృషి జరపాలని అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ వైసిపి కో-ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ కోరారు. ఎస్.యానం కు చెందిన ఎంపిటిసిల సమాఖ్య మండల అధ్యక్షుడు పెట్టా అప్పారావును మండల ఉపాధ్యక్షుడిగా నియమించారు. అప్పారావు ను డాక్టర్ శ్రీకాంత్ దుశ్శాలువా కప్పి సత్కరించారు.అలాగే వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు లంకే శ్రీను ఆధ్వర్యంలో ఎస్.యానాంకు చెందిన టిడిపి కార్యకర్త బర్రె జలబంధి రాజు వైసిపి లో చేరారు. రాజుకు డాక్టర్ శ్రీకాంత్ వైసిపి పార్టీ కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైసిపి జిల్లా కార్యదర్శి పొగాకు శ్రీను, నాయకులు రేవు రాజేష్, ముత్తాబత్తుల సురేష్, అంబటి శ్రీను, లంకే చిరంజీవి, ముదే దుర్గబాబు పాల్గొన్నారు.

పిల్లలపై తల్లిదండ్రులు దృష్టి పెట్టాలి

జగ్గంపేట : పిల్లలపై తల్లిదండ్రులు దృష్టి సారించాలని, వారు ఎక్కడకి వెళ్తున్నారు, ఏమి చేస్తున్నారనే విషయాలను గమనించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ దేవరపల్లి చెన్నారావు సూచించారు. శుక్రవారం డిగ్రీ కళాశాల ఆవరణలో పేరెంట్స్ టీచర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటువంటి సమావేశాలు ద్వారా పిల్లలు ఎలా చదువుతున్నారే విషయాలు తల్లిదండ్రులకు తెలుస్తాయన్నారు. విద్యార్థుల విజయానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సహకారం అందించాలని కోరారు. అనంతరం తల్లిదండ్రులు మాట్లాడుతూ తమ పిల్లల పురోభివద్ధికి పూర్తి సహకారాన్ని అందిస్తామని తెలిపారు.